ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 17 ఏప్రిల్ 2024

గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం అండ 8

గుడి చెరువు పనుల్లో వేగం పెంచాలి 8



సీతారాముల కల్యాణం చూతము రారండి..



- జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన ఆలయాలు
- వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో ఏర్పాట్లు
- నేడు శ్రీరామనవమి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సీతారాముల కల్యాలణానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలో సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ప్రధానంగా వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో సీతారామచంద్ర స్వామివారల దివ్య కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా శ్రీరామనవమి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో భద్రాద్రిని తలపించే రీతిలో సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంతోపాటు ఇల్లంతకుంట, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, తంగళ్లపల్లి, బోయినపల్లి, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, మండలాల్లోని హనుమాన్ దేవాలయాలతోపాటు వేంకటేశ్వర స్వామి, ఇతర దేవాలయాల్లో సీతారాముల కల్యాణం జరపడానికి ఏర్పాట్లు చేశారు. హనుమాన్ దీక్షాదారులు ముందు వరుసలో నిలిచి పనుల్లో నిమగ్నమయ్యారు. స్వామివారి కల్యాణం, పట్టాభిషేకం వంటి ఘట్టాలను నిర్వహించనున్నారు.



సిరిసిల్లలో సీతారాముల దేవాలయం వద్ద ఏర్పాట్లు



సీతారామచంద్రస్వామివారల ఉత్సవమూర్తులు



ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో బస చేసిన భక్తులు



విద్యుద్దీపాల అలంకరణలో రాజన్న క్షేత్రం

● ముస్తాబైన రాజన్న క్షేత్రం

వేములవాడ: జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో సీతారామచంద్రస్వామివారల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా శ్రీరామనవమి రోజున వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో భద్రాద్రిని తలపించే రీతిలో సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం ఉదయం 11-59 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. సీతారాముల కల్యాణం తిలకించడం కోసం వేలాది మంది భక్తులు రాజన్న క్షేత్రానికి తరలివస్తున్నారు. జానకీరాముల కల్యాణం సందర్భంగా శివుడిని మనువాడే ఆనవాయితీ ఉన్న వేలాదిమంది శివ పార్వతులతోపాటు భారీ సంఖ్యలో హిజ్రాలు వేములవాడ చేరుకున్నారు.

ఉమ్మడి జిల్లా సమస్యలపై సీఎం చర్చ



నాయకులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 : హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమస్యలపై చర్చించారు. బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కే సత్యనారాయణ, ప్రవీణ్‌తో సీఎం సమావేశం అయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భద్రాదికి 65 మంది పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 16: భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి బందో బస్తు నిర్వహించడానికి జిల్లా నుంచి 65 మంది పోలీసులు తరలివెళ్లారు. ఇందులో సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుల్‌లు ఉన్నారు. మరోవైపు తమిళనాడులో జరిగే ఎన్నికల బందోబస్తుకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 25 మంది హోంగార్డులు తరలివెళ్లారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, అభిషేకం తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

21న జిల్లా స్థాయి రన్నింగ్ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16: సిరిసిల్ల పట్టణం మినీస్టేడియంలో ఈ నెల 21న 3వ జిల్లా స్థాయి తెలంగాణ మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మంగళవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్య దర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. అండర్-14, 16, 18, 20 వయస్సు ఉన్న బాలబాలికలు, యువతీయువకులు తహసీల్దార్ జారీ చేసిన జనన ధ్రువీకరణ లేదా 10వ తరగతి మెమో జిరాక్స్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 7901454456 నంబరులో సంప్రదించాలని సూచించారు.

న్యాయం కోసం ఎంపీగా పోటీ

- నేరెళ్ల బాధితుడు కోల హరీష్



ప్లకార్డు ప్రదర్శిస్తున్న హరీష్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 16: ప్రభుత్వాలు మారిన తమకు న్యాయం జరగడం లేదని నిరసనగా నేరెళ్ల బాధితుల తరఫున కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు నేరెళ్ల బాధితుడు కోల హరీష్ ప్రకటించాడు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో తమకు న్యాయం కావాలంటూ మంగళవారం ప్లకార్డును ప్రదర్శించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రభుత్వాలు మారిన తమకు న్యాయం జరగడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించాలని, తమకు న్యాయం చేయాలని కోరాడు. తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులకు పదోన్నతులు కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఇద్దరు పోలీస్ అధికారులు, 30 మంది కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం పార్లమెంట్ ఎన్నికలను వేదికగా చేసుకొని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించాడు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 16:అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో మంగళవారం పలు అపార్ట్‌మెంట్లలో అగ్నిప్రమాదాల నివారణపై ఇన్‌చార్జి ఫైర్ అధికారి నర్సింహాచారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వంట గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపిస్తే వెంటనే తడిగుడ్డ పట్టుకొని రెగ్యులేటర్ బంద్ చేయాలని లేదా పైన బకెట్ వేసేస్తే మంటలు ఆరిపోతాయని గృహిణులకు వివరించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ మహిపాల్, ఫైర్‌మెన్‌లు సాగర్‌రెడ్డి, నాగరాజు, ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, ఎస్‌డీ సాదిక్, వి.రాజు పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీకి మిడ్ మానేరు

- ఎల్ఎండీకి నీటి విడుదల నిలిపివేత

బోయినపల్లి, ఏప్రిల్ 16: మిడ్ మానేరు ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరుకుంది. మంగళవారం ఎల్ఎండీ ప్రాజెక్టుకు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి నిల్వ తగ్గిపోవడంతో కుడి, ఎడమ కాలువలకు కూడా నీటి విడుదల చేయడం సాధ్యపడదని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 318 మీటర్లకు ను ప్రస్తుతం 305.77 మీటర్లు ఉండగా నీటి నిల్వ సామర్థ్యం 27.55టీఎంసీలకు 6.05 టీఎంసీల మేరకు నీటి నిల్వ ఉంది.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

సిరిసిల్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటి పోతున్న క్రమంలో జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధికారులకు సూచనలు చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. విద్య, వైద్యం, ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి నిర్మాణ పనుల స్టాండింగ్ కమిటీలకు జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షత వహించగా వైస్ చైర్మన్ సిద్ధం వేణు వ్యవసాయం, సాంఘీక సంక్షేమంపై బోయినపల్లి జడ్పీటీసీ కత్తెర పాక ఉమ అధ్యక్షతన సమావేశాలు కొనసాగాయి. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రాజెక్టులు, చెరువుల్లో నీటి నిల్వలు తగ్గి భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటవెంటనే జమ చేయాలని అన్నారు. జడ్పీటీసీలు మ్యాకల రవి, గుగులోతు కళావతి, చీటి లక్ష్మణ్‌రావు, నాగంకుమార్, గుండం నర్సయ్య, కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, జడ్పీ సీఈవో ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్



మాట్లాడుతున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 16: నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వేముల వాడ డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. మండలంలోని బొల్లారంలో డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున కమ్యునిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రతీ ఇంటా సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 40 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయిస్తునట్లు, తాగినట్లు తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట రూరల్ ఎస్సై మారుతీ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



లీకేజీతో చెరువును తలపిస్తున్న నీరు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 16: తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. దీంతో నీటి ఎద్దడి తలెత్తుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఇళ్లకు నీటి సరఫరా ఆవడం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించాలని, పైప్‌లైన్‌కు మరమ్మతు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



హవనము నిర్వహిస్తున్న అర్చకులు

స్వామివారికి అభిషేకం

వేములవాడ, ఏప్రిల్ 16: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో సీతారామచంద్రస్వామివారలకు మంగళవారం అభిషేకం నిర్వహించారు. శ్రీరామనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేదపండితులు రాజరాజేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సీతారామచంద్రస్వామికి ఉపనిషత్ ద్వారా అభిషేకం చేశారు. భక్తోత్సవంలో భాగంగా యాగశాలలో హవనము నిర్వహించారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేకములు నిర్వహించారు.

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- కొనుగోలు కేంద్రాల పరిశీలన
- అధికారులు, నిర్వాహకులపై ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: రైతులు కేంద్రాలకు తరలించిన ధాన్యం తూకం వేయకుండా నిద్ర పోతున్నారా? తేమ శాతం వచ్చినా ఎందుకు కొనుగోలు చేయడం లేదు. దళారులు వచ్చి కేంద్రంలోనేకాంటాలు పెట్టి ధాన్యం తీసుకెళ్తే మీరేం చేస్తున్నారు? రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు' అని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లలో నెలకొన్న జాప్యంపై 'కేంద్రాల్లో ధాన్యం.. అన్నదాత దైన్యం' అనే శీర్షికన ఈ నెల 16న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథానికి అదనపు కలెక్టర్ స్పందించారు. మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఐరిస్ విధానం, ట్యాబ్‌లో నమోదు, కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో అధికారులు, నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎందుకు జాప్యం చేస్తున్నారని మండి పడ్డారు. గోనె సంచులు రాక కేంద్రాల్లో అవస్థలు పడుతున్నామని రైతులు పేర్కొనడంతో ఏం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. వెంటనే సంచులు తెప్పించి సాయంత్రంలోగా కొనుగోళ్లను ప్రారంభించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రంలో ప్లాస్టిక్ సంచుల్లో తూకం వేసిన సంచులను చూసి ఇవెక్కడివని ఆరా తీశారు. దళారులు కాంటా పెట్టి కొనుగోలు చేస్తున్నారని రైతులు, నిర్వాహకులు చెప్పడంతో కేంద్రంలో ఎలా తూకం వేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు ఎంత చెల్లిస్తున్నారని ప్రశ్నించారు. రూ.1800 చెల్లిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం మద్దతు ధర అందిస్తే అంత తక్కువకు ఎందుకు అమ్ముకుంటున్నారన్నారు. కొనుగోళ్లలో జాప్యంతో గత్యంతరం లేక విక్రయించుకుంటున్నామని వాపోయారు. సంచికి 40.600 కిలోలు తూకం వేయాలని సూచించారు. మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తే తమకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలో మొత్తం 259 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. 150 కేంద్రాల్లో ధాన్యం సేకరన కొనసాగుతోందన్నారు. మిగతా కేంద్రాలకు రైతులు ఇప్పుడిప్పుడే ధాన్యాన్ని తరలిస్తున్నారని, తేమ శాతం రాక పోవడంతో కొనుగోలు చేయడం లేదన్నారు. కేంద్రాల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీఎం జితేంద్రప్రసాద్, డీపీఎం సుధారాణి, నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ, ఏపీఎం శ్రీనివాస్ ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల శివారులో రెండో బైపాస్ రోడ్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం క్వింటాల్ ధ్యాన్యానికి రూ.2203, బీ గ్రేడ్ రకానికి రూ. 2183 నిర్ణయించిదని వెల్లడించారు. దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : రైతులు పంటను దళారులకు విక్రయించ వద్దని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు భూక్యతండా, బాబాయ్ చెరువు తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తూకాన్ని, రిజిస్టర్లను, ట్రక్ షీట్లను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డిపిఎం సుధారాణి, అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ఎలుసాని ప్రవీణ్ కుమార్, ఏపీఎం నర్సయ్య, సీసీ శ్యామల ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ధర్మారం,ఏప్రిల్16: ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మిట్ట మహిపాల్(45) అనే వ్యక్తి మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

మల్లాపూర్, ఏప్రిల్, 16: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య(34) అనే రైతు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య అనే రైతు మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి రేకుల షెడ్డులోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు నర్సయ్య భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

● ఎస్‌యూ వీసీ ఆచార్య మల్లేశ్

గణేశ్‌నగర్, ఏప్రిల్16: ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య మల్లేష్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో 2024 మహనీయుల జయంత్యుత్సవాలను (మహాత్మాజ్యోతిరావుపూలే, సావిత్రిబాయ్ పూలే, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ) ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశమంతా మహనీయుల సేవలను గుర్తించుకోవాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్య అడప సత్యనారాయణ మాట్లాడుతూ అత్యంత ప్రభావశీలి, దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆచార్య గోన నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వడమే ధ్యేయంగా పూలే దంపతులు జీవించారన్నారు. ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కే పద్మావతి మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లతో అందరికీ సమాన అవకాశాలు వచ్చాయన్నారు. జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ మహనీయులంతా దేశ ప్రగతి కోసం, సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం సరసిజ, ఆర్ట్స్, సైన్స్ కామర్స్ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కే తిరుపతి, డి విజయ ప్రకాష్, డి.విజయ్ కుమార్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

టిప్పర్లకు జరిమానా

మల్యాల, ఏప్రిల్ 16: అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లకు రెవెన్యూ అధికారులు ఒక్కో టిప్పరుకు రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. సోమవారం మండలంలోని బల్వంతాపూర్‌లో గల రేగుల చెరువు నుంచి అక్రమంగా నల్లమట్టి తవ్వకాలు చేపట్టారనే దానిపై భారతపు శేఖర్‌తో పాటు ఎనిమిది టిప్పర్ల యజమానులు, డ్రైవర్లపైన పోలీసులు సుమోటో కేసు నమోదు చేసి టిప్పర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దీంతో తహసీల్దార్ టిప్పర్లకు జరిమానా విధించారు.

● ఇద్దరిపై కేసు..

మల్యాల మండలంలోని రాంపూర్ శివారులో వరదకాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కావేటర్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్ బంగారపు రమేష్, మట్టి తీస్తున్న ఎక్స్‌కావేటర్ యజమాని గంగాధర్‌పై ఇరిగేషన్ ఏఈఈ అరుణ్‌కుమార్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

● టిప్పర్ డ్రైవర్‌పై కేసు..

మల్యాల మండలంలోని రాజారంలో టిప్పర్ ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం అయింది. టిప్పర్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సాయి దిలీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ సస్పెండ్

హుజూరాబాద్, ఏప్రిల్ 16: హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. సోమవారం ఆర్టీసీ డ్రైవర్ రవీందర్ చార్జి మెమో విషయంలో రూ. 20వేలు లంచం తీసుకుంటూ ఎల్కతుర్తిలోని ఓ హోటల్‌లో డిపో మేనేజర్ శ్రీకాంత్ ఏసీబీకి చిక్కిన విషయం విధితమే. డిప్యూటీ ఆర్‌ఎం సురికొంటి భూపతిరెడ్డి డీఎంపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపించగా, సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 16: నిషేధిత గంజాయి రవాణా, అమ్మకాలు జరుపుతున్న అరుగురుఇ వ్యక్తులను గోదావరిఖని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న సోమవారం సంత ఆవరణలో మచ్చుపేటకు చెందిన రఘును గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. రఘుని అదుపులోకి తీసుకుని విచారించగా, గుంటూరుపల్లికి చెందిన శివారూట్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కాలనీ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తెలిపినట్టు సీఐ పేర్కొన్నారు. గుంటూరుపల్లిలో శివారూట్ కోసం వెళ్లగా అక్కడ శివ దగ్గర పనిచేసే మధు అదుపులోకి తీసుకుని వివచారించినట్టు సీఐ తెలిపారు.

మధు ఇచ్చిన సమాచారం ఆధారంగా శివారూట్ దగ్గర గంజాయి కొనుగోలు చేసిన వినోద్, శివప్రసాద్, చైతన్య, సాయి రేవంత్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1,117 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ బీ రవీందర్ తెలిపారు.

కష్టాలను ఎదిరించి.. లక్ష్యాన్ని సాధించి

- యూపీఎస్సీలో మెరిసిన వెలిచాల యువకుడు
- జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించిన బీడీ కార్మికురాలి కుమారుడు

రామడుగు, ఏప్రిల్ 16: తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు.. తల్లి బీడీలు చేస్తూ కొడుకును పోషించింది. ఎటు చూసినా కష్టాలు.. అయినా అతడు తన లక్ష్యంపైనే దృష్టి పెట్టాడు. అనుకున్నది సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. అతడే రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన సాయికిరణ్. అతడు బీటెక్ చదువుతుండగా తండ్రి క్యాన్సర్‌తో మృతి చెందాడు. సాయికిరణ్‌కు స్రవంతి అనే ఒక సోదరి ఉంది. పిల్లలిద్దరూ చదువులో ముందుండేవారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా తల్లి లక్ష్మి ధైర్యం కోల్పోలేదు. బీడీలు చేస్తూ పిల్లలను చదివించింది. పిల్లలూ ఆమె నమ్మకాన్ని వమ్ము చేయలేదు. సాయికిరణ్ సోదరి స్రవంతి ఏఈఈగా పనిచేస్తున్నారు. సాయికిరణ్ వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేసి ఓ కంపెనీలో హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. ఆర్థికంగా కొంత వెసులుబాటు లభించిన తర్వాత తాను చిన్నప్పటి నుంచి కలలు కన్న సివిల్స్‌పై దృష్టి సారించాడు. 2021 నుంచి ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా తానే సొంతగా ప్రిపేర్ అయ్యాడు. రెండో ప్రయత్నంలో లక్ష్యాన్ని చేరుకుని జాతీయ స్థాయిలో 27వర్యాంకు సాధించాడు.


తల్లి, సోదరితో సాయికిరణ్

అమ్మ అండతో చదివాను

- సాయికిరణ్, సివిల్స్ 27వ ర్యాంకర్

కష్టపడి చదివాను.. అనుకున్నది సాధించాను. ఇది నా జీవితంలో మధురమైన సందర్భం. అత్యున్నతమైన స్థానానికి చేరుకున్నందుకు సంతోషంగా ఉంది. మా అమ్మ అండగా నిలవడం వల్లే ఇది సాధ్యమైంది. కష్టాలను ఎదురించి మమల్ని చది వించిన అమ్మ ఇప్పుడు సంతోషంగా ఉంది. నాలాగే కష్టపడి చదివే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ సహకారాన్ని అందిస్తానను.

● విద్యాభ్యాసం

సాయికిరణ్ రామడుగు మండలం వెలచాల గ్రామంలో సరస్వతి పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. కరీంనగర్‌లో పదో తరగతి, ఇంటర్, వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశాడు.

సంతోషంగా ఉంది

- లక్ష్మి, సాయికిరణ్ తల్లి

చాలా సంతోషంగా ఉంది. సాయికిరణ్ సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించడం మాకందరికీ గర్వకారణం. మా ఆయన లేకపోయినా కష్టపడి ఇద్దరు పిల్లలను చదివించాను. వారిద్దరు ప్రయోజకులయ్యారు. నా కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించింది. ఒక తల్లికి ఇంతకంటే సంతోషం ఏముంటుంది.


వెలిచాలలో సాయికిరణ్ ఇల్లు

'సహన'ంతో ముందుకుసాగి..

సివిల్స్‌లో 739వ ర్యాంకు సాధించిన కరీంనగర్ యువతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 16: యూపీఎస్సీ ఫలితాల్లో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన సహన జాతీయస్థాయిలో 739వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక గీత, జయశంకర్ ప్రసాద్ (అనిల్) దంపతుల కూతురైన సహన కెన్‌క్రెస్ట్ స్కూల్‌లో ఎసెస్సీ చదివారు. శ్రీగాయత్రీ జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ జేఎన్టీయూలో బీటెక్ పూర్తి చేశారు. ఇంజనీరింగ్ పూర్తికాగానే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చినప్పటికీ సివిల్స్‌పై మక్కువతో ఉద్యోగంలో చేరకుండా ఢిల్లీకి వెళ్లి కోచింగ్ తీసుకున్నారు. తొమ్మిది నెలలు కోచింగ్ తీసుకున్న సహన మూడుసార్లు సివిల్ పరీక్ష రాశారు. నాలుగో ప్రయత్నంలో జాతీయ స్థాయిలో 739వ ర్యాంకు సాధించారు. సహన తండ్రి జయశంకర్ ప్రసాద్ (అనిల్) ప్రైవేట్ కళాశాలలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఒక దినపత్రికలో పాత్రికేయుడిగా పనిచేస్తున్నారు. తల్లి గీత గృహిణి. తమ కూతురు కష్టపడి చదివి నందుకు తగిన ఫలితం దక్కిందని, ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. తల్లిదండ్రుల సహకారంతో సివిల్స్‌కు ప్రిపేర్ అ య్యానని సహన చెప్పారు. ఈ ర్యాంకుతో ఐఆర్ఎస్ వస్తుందని, జాబ్‌లో జాయిన్ అయిన తర్వాత మళ్లీ సివిల్స్ రాసి ఐఏఎస్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.


విజయ సంకేతం చూపుతున్న సివిల్స్ ర్యాంకర్ సహన


సహనకు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు గీత, జయశంకర్‌ప్రసాద్ (అనిల్)

ఉపాధ్యాయుల జీతాల బిల్లుల దుర్వినియోగంపై

కొనసాగుతున్న విచారణ

తిమ్మాపూర్, ఏప్రిల్16: మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా ఉపాధ్యాయుల జీతాల బిల్లుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోంది. ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయుల జీతాల బిల్లుల నిధులు సుమారు 10లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. విచారణ అధికారిగా డైట్ ప్రిన్సిపాల్ శ్రీ రాం మొండయ్య, బెజ్జంకి, కోహెడ ఇంచార్జ్ ఎంఈవోగా విధులు నిర్వర్తిస్తున్న పావని ప్రజెంటింగ్ అధికారిగా, జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ కన్సల్టెంట్ రవీందర్‌ను టెక్నికల్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారి నియమించారు. ఈ నెల 15న విచారణ ప్రారంభించారు. రెండవ రోజు మంగళవారం 16న కూడా విచారణ కొనసాగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజభాను చంద్రప్రకాశ్‌తో పాటు మొత్తం 21మంది ఉపాధ్యాయులను విచారణ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నివేదికను జిల్లా విద్యాశాఖధికారికి సమర్పిస్తామని విచారణ అధికారి శ్రీరాం మొండయ్య తెలిపారు.

రాముని కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పణ

ఇల్లందకుంట, ఏప్రిల్ 16: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే శ్రీరామనవమిని పురస్కరించుకొని మంగళవారం ధర్మపురి, కొండగట్టు ఆలయాల కార్యనిర్వాహణాధికారులు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో కొండగట్టు ఈవో చంద్రశేఖర్, ధర్మపురి ఈవో శ్రీనివాస్, ఇల్లందకుంట ఈవో కందుల సుధాకర్, అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యులు పాల్గొన్నారు.

నేడే సీతారాముల కల్యాణం

● ముస్తాబైన రాజన్న క్షేత్రం ● ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు ● తరలివస్తున్న భక్తుల

వేములవాడ, ఏప్రిల్ 16:వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీసీతారామచంద్ర స్వామివారల దివ్య కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో భద్రాద్రిని తలపించేరీతిలో శ్రీసీతారామచంద్రస్వామివారి కల్యాణ వేడుకలను అత్యంత ఘనంగా, కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా 17వ తేదీ బుధవారం ఉదయం 11-59 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించే విధంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆలయం, రాజగోపురం, ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. చైర్మన్ ఛాంబర్ ఎదుట విశాలమైన కల్యాణ వేదికను నిర్మించి పూలతో అందంగా అలంకరించారు. వేదిక పరిసరాల్లో కలకత్తా టెంట్లు, పందిళ్ల, షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులు కూర్చునే ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎండవేడి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎయిర్ కూలర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయ ముందుభాగంతో పాటు పాత ఆంద్రాబ్యాంక్ ఏరియా, అంబేద్కర్ విగ్రహం కూడలి మొత్తం కలకత్తా పందిళ్లు వేశారు. శ్రీసీతారాముల కళ్యాణం భక్తులందరూ వీక్షించడానికి వీలుగా పలు చోట్ల ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య శిబిరాలు, స్పెషల్ రెస్క్యూ బృందాలు ఏర్పాటు చేశారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్, అగ్నిమాపక యంత్రం సిద్ధంగా ఉంచారు. భక్తుల కోసం మంచినీటి ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు. దాతల సహకారంతో అన్నదానంతో పాటు మజ్జిగ పంపిణీ చేయనున్నారు.


గదుల కోసం వేచి చూస్తున్న భక్తులు


విద్యుత్‌కాంతులతో రాజన్న ఆలయం

తరలివస్తున్న భక్తులు..

శ్రీసీతారాముల కళ్యాణం తిలకించడం కోసం వేలాది మంది భక్తులు రాజన్న క్షేత్రానికి తరలివస్తున్నారు. 17వ తేదీ బుధవారం ఉదయం నిర్వహించనున్న కల్యాణం ప్రత్యక్షంగా తిలకించాలన్న కోరికతో మంగళవారం రాత్రి వరకు సుమారు 70 వేల మందికి పైగా భక్తులు వేములవాడకు చేయకున్నట్లు అంచనా. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యాత్రీకులతో ఆలయ వసతి గదులు, ప్రైవేటు అద్దె గదులు నిండిపోయాయి. గదులు అందుబాటులో లేకపోవడంతో వేలాది మంది భక్తులు బహిరంగ ప్రదేశాలలోనే బస చేయాల్సి వచ్చింది. జానకిరాముల కల్యాణం సందర్భంగా త్రిశూలం ధరించి, తలంబ్రాలు పోసుకుని శివుడిని మను వాడే ఆనవాయితీ ఉన్న వేలాది మంది శివ పార్వతులతో పాటు భారీ సంఖ్యలో హిజ్రాలు వేములవాడ చేరు కున్నారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాజరాజేశ్వరస్వామివారిదేవస్థానంలో బుధవారం కోడె మొక్కులు మినహా ఆర్జిత సేవలు నిలిపి వేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

వివాహిత ఆత్మహత్య


సుమలత(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్16: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన గోస్కుల సుమలత(26)కు 2017వ సంవత్సరంలో తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. వీరికి నాలుగు సంవత్సరాల కూతురు ఉంది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుమలత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.

జీవితంపై విరక్తితో..

ముస్తాబాద్, ఏప్రిల్ 16: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడని ఎస్సై శేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన బొప్ప బాలయ్య(67) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వ్యాధి మరింత ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుని కొడుకు బొప్ప అనిల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన సావనపెల్లి పోచవ్వ (70) అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పోచవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తిచెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..


ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: మండలంలోని ఎర్రనర్సపల్లె గ్రామానికి చెందిన కంకటి స్వామి (45) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. స్వామి గ్రామంలో కిరాణం దుకాణం నడుపుకొని జీవిస్తున్నాడు. వ్యవసాయ భూములలో బోర్లు వేయడం వల్ల దాదాపు 23లక్షల అప్పులు అయ్యాయి. అప్పు చెల్లించడానికి తనకు ఉన్న భూమిని అమ్మడానికి ప్రయత్నించగా తమ్ముడు ప్రభాకర్ అడ్డుచెప్పాడు. ఇంటిని అమ్మి అప్పులు తీర్చుదామనుకున్నా ఇంటిపై ప్రభాకర్ రుణం తీసుకున్నాడు. ఇదే విషయంపై తమ్ముడిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదు. దీనితో సోమవారం అర్ధరాత్రి క్రిమిసంహారక మందుతాగగా సిరిసిల్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తన భర్త మృతికి ప్రభాకర్, అప్పులే కారణం అని కడుపుపై రాసుకొని చనిపోయాడని మృతుడి భార్య నాగమణి ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం


రాజయ్య(ఫైల్)

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 16: తన భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు అదృశ్యం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లికి చెందిన కొలకాని రాజయ్య (46) ఎనిమిది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రెండు సంవత్సరాలుగా ఆరోగ్యం బాగా ఉండటం లేదు. అప్పటి నుంచి మందులు వాడుతున్నాడు. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ నెల 9న రాత్రి 8.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బ్లూ కలర్ ప్యాంట్, ఎల్లో కలర్ టీషర్టు ధరించి ఉన్నాడు. రాజయ్య భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

స్కూల్ వ్యాన్ కింద పడి చిన్నారి దుర్మరణం


అరీబా (ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 16: కొడుకును స్కూల్ వ్యాన్ ఎక్కించడానకి వెళ్లిన తల్లి.. తన వెనుకాలే వస్తున్న తన కూతురును గమనించక పోవడంతో అదే వ్యాన్ కింద పడి చిన్నారి దుర్మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలం ముద్దుట్ల గ్రామానికి చెందిన రజాక్, హసీనకు కొడుకు సాజీత్, కుమార్తె అరీబా(18నెలలు) ఉన్నారు. కొడుకు పక్క గ్రామంలోని సరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. మంగళవారం ఉదయం స్కూల్ వ్యాన్ రావడంతో కొడుకును ఎక్కించేందుకు తల్లి హసీన వెళ్లింది. వ్యాన్ వద్దకు చిన్నారి అరీబా రావడాన్ని తల్లి గమనించలేదు. సాజిత్ ఎక్కగానే వ్యాన్ ముందుకు కదలడంతో ముందు చక్రాల కింద అరీబా పడి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందింది. ఈ మేరకు డ్రైవర్ ఎనగందుల రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. వ్యాన్‌లో విద్యార్థులను ఎక్కించడానికి పాఠశాల సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ సర్కార్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16: భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్కార్ ఖూనీ చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. చంద్ర రాజేశ్వరావు చిత్రపటానికి చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మర్రి వెంకటస్వామి, జిల్లా నాయకులు నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. చంద్ర రాజేశ్వరరావు తన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేశారని అన్నారు. దోపిడీ రహిత, వర్గరహిత సమాజం కోసం జీవితకాలం పనిచేశారన్నారు.


చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బద్ది పోచమ్మకు భక్తుల మొక్కులు



బోనాలతో బారులుదీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 16:వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ దేవస్థానం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం అండ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 16: గల్ఫ్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ డెక్కన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమార్థం ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గత ఎన్నికల సమయంలో గడపగడపకు ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రతీ గల్ఫ్ కార్మికుడి కుటుంబ సభ్యులు తనకు అండగా నిలబడినారని, గెలుపులో భాగస్వామ్యం అయ్యారని అన్నారు. గల్ఫ్‌కు వెళ్లిన ప్రతీ కార్మికుడు క్షేమంగా ఇంటికి రావాలని కోరుకుంటామని, అయితే అనుకోని పరిస్థితులతో ఏదైనా జరిగితే గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష రూపాయల పరిహారం చెల్లించిందని, మళ్లీ ఇన్ని సంవత్సరాల తర్వాత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల పరిహారం అందిస్తోందన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో గల్ఫ్ కార్మికులను, వారి సంక్షేమాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం 100 కోట్లు ఇస్తామని చెప్పి గత ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. పది సంవత్సరాల్లో శంషాబాద్ విమానాశ్రయం వారి లెక్కల ప్రకారం సుమారు 2000 వరకు పార్థివ దేహాలు గల్ఫ్ దేశాల నుంచి వచ్చాయని, వారి కుటుంబ సభ్యులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఐదు లక్షల పరిహారం అందజేస్తామని చెప్పామని, అందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి చెక్కును రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలో మర్రిపెల్లి, బావుసాయిపేట గ్రామాల్లో చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశామని గుర్తు చేశారు.

తెలంగాణలో ఉన్న గల్ఫ్ కార్మికుల కుటుంబ సభ్యుల పిల్లలకు గురుకులాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో గల్ఫ్ కార్మికులను ఆదుకునేందుకు కేరళ తరహా పాలసీ తీసుకొచ్చేందుకు పరిశీలిస్తున్నామని, తెలంగాణ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎన్ఆర్ఐ శ్రీనివాస్



సీఎంతో ఎన్ఆర్ఐ జనగామ శ్రీనివాస్

ముస్తాబాద్, ఏప్రిల్ 16 : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ జనగామ శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. టీపీసీసీ ఎన్ఆర్ఐ ఆధ్వర్యంలో గల్ఫ్ భరోసా సమావేశాన్ని హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ దక్కన్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో జనగామ శ్రీనివాస్‌కు అందిన పిలుపు మేరకు హాజరయ్యారు. గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎంను కోరినట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్మికులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాల పండుగ

కోనరావుపేట, ఏప్రిల్ 16: కోనరావుపేట మండలం ధర్మారంలో మంగళవారం ఎల్లమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబసభ్యులు క్షేమంగా ఉండాలని వేడుకున్నారు. రేణుక గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే మున్నూరుకాపుల అభివృద్ధి

ముస్తాబాద్, ఏప్రిల్ 16:ఐకత్యతతోనే మున్నూరు కాపుల అభివృద్ధి సాధ్యమని ఆ సంఘం మండల అధ్యక్షుడు మెంగని రాజు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముందస్తుగా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. త్వరలోనే జిల్లా కమిటీ ఏర్పాటవుతుందని పేర్కొన్నారు. అడ్‌హక్ కమిటీ సభ్యులు తడుకల దేవరాజు, అప్పాపూల లక్ష్మణ్, అగ్గి రాములు, ముకాస సభ్యులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి ఓట్లు అడిగే అర్హత లేదు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16: ఎంపీగా ఐదేళ్లలో ఐదు పైసలు కూడా నియోజకవర్గానికి తీసుకురాని బండి సంజయ్‌కి ఓట్లు అడిగే అర్హత లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బోయినపల్లి వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ మంజూరు చేయించి 50 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే ఆ తరువాత వచ్చిన ఎంపీ బండి సంజయ్ పట్టించుకోకపోవడంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేరే రాష్ట్రానికి తరలించిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన వంద రోజుల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఏ పరిస్థితుల్లో ఉందో ప్రజలకు కనిపిస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్‌తో పాటు బోయినపల్లి వినోద్‌కుమార్ కీలక పాత్రను పోషించారన్నారు. గతంలో ఎంపీగా వినోద్‌కుమార్ మనోహరబాద్ రైల్వేలైన్, కరీంనగర్ పరిధిలో జాతీయ రహదారులు, వెయ్యి కోట్లతో కరీంనగర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దారన్నారు. విద్యావంతుడైన వినోద్‌కుమార్‌ను మరోసారి గెలిపించాలన్నారు. బీఆర్ఎస్వీ నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, వెంకటేష్, అరవింద్, హర్షిత్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అధిక తూకం వేస్తే అన్నదాతల పక్షాన నిలదీస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, రాజునాయక్, దేవయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో ధాన్యం.. ప్రైవేటు పరం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: ఆరుగాలం కష్టించి పండించిన పంటకు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో మద్దతు ధర దక్కడం లేదు. రెక్కలు ముక్కలు చేసుకున్న రైతన్న శ్రమను దళారులు కేంద్రంలోనే అధికారులు, నిర్వాహకుల కళ్లెదుటే దోచుకుపోతున్నారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించిన ఓ రైతు కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో నిరీక్షించాడు. అదే అదనుగా తీసుకున్న దళారి కేంద్రానికి వచ్చి క్వింటాల్‌కు రూ.1800 చొప్పున కొనుగోలు చేశాడు. కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో గత్యంతరం లేక తక్కువ ధరకు అమ్ముకున్నానని రైతు వాపోయాడు. కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అబద్ధాలతో అధికారం చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అన్ని వర్గాల ప్రజలను వంచించిందన్నారు. అంబేద్కర్ జయంతి రోజున ఆయన విగ్రహం వద్ద పూలతో అలంకరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటు పడిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ మధు, నాయకులు సుభాష్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

గుడి చెరువు పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



ఆలయ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ, ఏప్రిల్ 16 : వేములవాడ పట్టణంలోని గుడి చెరువు అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడ గుడి చెరువులో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చెరువు బండ్ పార్క్‌లో కొనసాగుతున్న నిర్మాణాలను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్, ఇతర నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనులు, సుందరంగా, ఆకర్షణీయంగా సంప్రదాయ బద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. పిల్లల ఆట స్థలాలు, వాకింగ్ ఏరియా, ఓపెన్ జిమ్ తదితర పనులన్నీ రానున్న జూన్ మాసం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని, కాంట్రాక్టర్ ఇందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే కాంట్రాక్టర్‌ని బ్లాక్ లిస్ట్ పెట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. సూర్య నమస్కారాలు, ఇతర విగ్రహాలకు పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయని, అయితే పండుగలు, వరుస సెలవుల కారణంగా పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గుడి చెరువు ఆవరణలో కొనసాగుతున్న శివార్చన స్టేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. శివార్చన స్టేజీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆలయ ఈఈ రాజేష్‌ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పార్క్‌ను కలెక్టర్ పరిశీలించారు. పార్క్‌లో పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, మొక్కలు, విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టమ్, బెంచీలు, వివిధ రకాల ఆర్ట్స్ వేయనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ పనులను వచ్చే నెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, టూరిజం డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్ రెడ్డి, అర్బన్ తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డీటీసీపీఓ అన్సారీ, ఆలయ ఈఈ రాజేష్, మున్సిపల్ ఏఈ నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ యంత్ర ప్రతిష్ఠాపన

తంగళ్లపల్లి, ఏప్రిల్ 16: తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్‌లో శివలింగ సహిత భక్త హనుమాన్‌దేవాలయంలో మహాగణపతి, శివలింగ, నంది, సూర్య, జోడు నాగులు పార్వతి, ఆంజనేయ స్వామి విగ్రహ యంత్ర ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.మంగళవారం హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి ఇల్లంతకుంటలో గంజాయి విక్రయించేందుకు వస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టామని, ద్విచక్ర వాహనంపై వస్తున్న భూపేంద్ర కుమార్, కృష్ణంరాజు భరత్ వినాయక్ వద్ద 130 గ్రాముల గంజాయి లభించిందని పేర్కొన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అభినందించారు.

లోక్ సభ ప్రముఖ్‌గా మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి

ముస్తాబాద్, ఏప్రిల్ 16 : కరీంనగర్ లోక్ సభ బీజేపీ ప్రముఖ్‌గా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మట్ట వెంకటేశ్వర్‌రెడ్డిని, సహ ప్రముఖ్‌గా శివ రామకృష్ణను నియమించారు. మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి నియామకంపై ముస్తాబాద్ బీజేపీ అధ్యక్షుడు అంజాగౌడ్, పట్టణ అధ్యక్షుడు మెంగని మహేందర్, జనార్దన్, గిరి, సంతోష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ నాయకులవి దొంగ దీక్షలు

ముస్తాబాద్, ఏప్రిల్ 16: బీజేపీ నాయకులవి దొంగ దీక్షలని, దొంగ మాటలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తీసుకొచ్చి వందలాది మంది రైతులను పొట్టను పెట్టుకున్న దుర్మార్గపు ప్రభుత్వమన్నారు. వడగండ్ల వానతో రైతులు నష్టపోతే కిషన్ రెడ్డి ఒక్క పైసా తీసుకురాలేదని, ఇప్పుడు కపట ప్రేమ కనబరుస్తున్నారని అన్నారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొడం రాజిరెడ్డి,ప్యాక్స్ డైరెక్టర్ కొండల్‌రెడ్డి, ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు తలారి నర్సింలు, శీల ప్రశాంత్, యూత్, పట్టణ అధ్యక్షులు రంజాని నరేశ్, తాళ్ల విజయ్‌రెడ్డి, గన్నె భాను, వెల్మల రాంరెడ్డి, గూడ లక్ష్మారెడ్డి, మామిండ్ల అంజనేయులు, ఉచ్చిడి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం సలహాదారుడిని కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారని నాయకులు పేర్కొన్నారు. నాయకులు విజయ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చందుర్తి, ఏప్రిల్ 16 : చందుర్తి మండలం మూడపల్లి వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శెట్టిపలి సాయికుమార్ (24) మంగళవారం మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లికి చెందిన సాయికుమార్ చందుర్తి మండలం జోగాపూర్ లో సోమవారం ఓ శుభకార్యానికి హాజరై తిరిగి బైక్‌పై పులి మారుతి అనే యువకుడితో కలిసి వస్తున్నారు. మూడపల్లి వద్ద అదుపు తప్పి కింద పడడంతో సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి.మారుతి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సాయి కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి రిమాండ్

కోనరావుపేట, ఏప్రిల్ 16 : హైదరాబాద్ గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు ప్లాట్‌లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిని రిమాండ్ పంపినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన మెరుగు బాబు హైదరాబాద్ గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు ప్లాట్లు ఇప్పిస్తానని మోసానికి పాల్పడ్డాడు. డబ్బులు ఇచ్చిన వారు రిజిస్ట్రేషన్ చేయాలని అడిగితే చంపేస్తానని బెదిరించాడు. కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన శాసన పద్మ, రామన్నపేట గ్రామానికి చెందిన చెర్ల భూదవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



సీఎంను సన్మానిస్తున్న భూమేష్



కాంగ్రెస్‌లో చేరుతున్న సరళ-రాజనర్సింహరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గం బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన పిట్టల భూమేష్ ఆ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. భూమేష్‌తో పాటు నాయకులు లింగంపల్లి మధూకర్, ఎడ్ల రాజ్‌కుమార్, జజ్జరి నర్సయ్య, గుడిసె రమేష్, రాణవేణి లక్ష్మన్ ఉన్నారు. అనంతరం పిట్టల భూమేష్ అనుచరవర్గం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి చిత్రపటాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ దంపతులు నేవూరి మమత- వెంకట్‌రెడ్డి హైదారాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డికి చిత్ర పటాన్ని అందజేసి సన్మానించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. బీఎస్పీ నాయకులు ఎడ్ల రాజ్‌కుమార్, లక్ష్మణ్, దేవయ్యలు సీఎం రేవంత్‌రెడ్డికి రాజన్న ప్రసాదం అందజేశారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని దమ్మన్నపేటకు చెందిన రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు అరుట్ల అంజిరెడ్డితోపాటు కొత్తపల్లి మాజీ సర్పంచ్ అక్కపల్లి సరళ, మాజీ సింగిల్‌విండో చైర్మన్ అక్కపల్లి రాజనర్సింహరెడ్డి, గ్రామ పంచాయతీ కో ఆప్షన్ సభ్యుడు దేవగౌడ్ పార్టీలో చేరారు.

19న మందకృష్ణ పర్యటన

వేములవాడ రూరల్, ఏప్రిల్ 16: వేములవాడలో ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పర్యటిస్తారని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్లు పసుల భేష్ కుమార్, కమలాకర్ అన్నారు. వేములవాడ పట్టణంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణలో మోసం చేసిన గత ప్రభుత్వం బీఆర్ఎస్‌ను ప్రస్తుత ప్రభుత్వం కాంగ్రెస్‌ను పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. వర్గీకరణ చేయడానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్న బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీ,అనుబంధ సంఘాలైన మాదిగ విద్యార్థి, మాదిగ మహిళా విభాగం, మాదిగ ఉద్యోగులు, మాదిగ యువసేన, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బొల్లారం చంద్రమౌళి, మంగలీ చంద్రమౌళి, పసుల సుధాకర్, తాండ్రాల తిరుపతి, సతీష్, జింక శ్రీధర్, కొత్తపేట అంజయ్య, కొడిమ్యాల శంకర్ పాల్గొన్నారు

సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న మాధవానందసరస్వతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16: శ్రీరామనవమి సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట తదితర గ్రామాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. గొల్లపల్లి, నారాయణపూర్ గ్రామాల్లోని సీతారామచంద్రస్వామి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభయ్యాయి. గొల్లపల్లిలోని ఆలయంలో తొగుట పీఠాధిపతి మాధవానందసరస్వతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు విద్యాసాగర్‌శర్మ ఆధ్వర్యంలోని పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. నారాయణపూర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు కల్యాణాచార్యులు, వేణుగోపాలచారి, నవీన్‌చారి హోమం నిర్వహించారు. బుధవారం ప్రభాతసేవ, పూర్ణాహుతి, స్వామివారి కల్యాణం, రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కోనరావుపేట: శ్రీరామ నవమి సందర్భంగా నేడు నిర్వహించే రాముల కళ్యాణానికి మామిడిపల్లి సీతారాముల ఆలయం ముస్తాబు అయింది. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆధీనంలో మామిడిపల్లి సీతారాముల ఆలయం కొనసాగుతుంది. బుధవారం నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం తో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్, మార్కెట్ ఏరియాతోపాటు పలువార్డులలో బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ ఆడెపు రేవంత్, బీజేపీ నాయకులు గాజుల సదానందం, వేముల పోశెట్టి, తాటిపాముల సత్యం, దీకొంగ భాగ్య, ఎస్‌డీ పర్వానా, మ్యాన బాలకిషన్,గోశికొండ అంబదాస్, పోలాస గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాలలో బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. రాబోవు ఎన్నికలలో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దుద్దెడ రాజుగౌడ్, పోరెడ్డి రఘుపతిరెడ్డి, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, ఒగ్గు మోహన్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ బూత్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు వేములవాడ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, మండల బీజేపీ అధ్యక్షుడు పోంచెట్టి రాకేష్, నాయకులు చిర్రం తిరుపతి, లోలపు శేఖర్, మర్రి రమేష్, మెంగని శ్రీనివాస్, చిలుముల హన్మయ్యచారి, సిరికొండ పర్శరాములు,మెడిశెట్టి శ్రీహరి, తిరుపతి, తిప్పని సతీష్, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లేసి గోసపడుతున్న ప్రజలు



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న వినోద్‌కుమార్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 16: కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన ప్రజలు అరిగోస పడుతున్నారని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీఆంజనేయస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం జడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ జడ్పీచైర్‌పర్సన్ తుల ఉమతో కలిసి అనుపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చినా ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రారంభించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పుడు కొనుగోలు చేస్తే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే సాకుతో ఇప్పటి వరకు కొనుగోళ్లు చేపట్టడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చే బోనస్ దేవుడెరుగు కనీస మద్దతు ధర దక్కడం లేదని రైతులు ఆందోళనకు గురువుతున్నారన్నారు. యాసంగి పంటకు బోనస్ ఇస్తమన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు వచ్చే ఖరీఫ్ నుంచి ఇస్తామని చెప్పడం రైతులు గుర్తించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ యాసంగి పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి, ప్రస్తుతం ఆగస్టులో రుణమాఫీ చేస్తామని మరో కొత్తరాగానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో రైతుల ఓట్లు దండుకోవడం కోసమే అమలుకాని హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో రైతులు ధాన్యం తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు పోసినా ఎప్పుడు కొంటారో తెలియక దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వానికి రైతులపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, రైతులపై ప్రభుత్వానికి ఏమాత్రం ప్రేమ ఉన్నా ఇప్పటి వరకు ధాన్యం తరలించేందుకు ఎందుకు మిల్లులు అలాట్‌మెంట్ చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పుడు ధాన్యం కొనుగోలు ఆలస్యం చేస్తే రైతులు విధిలేని పరిస్థితులల్లో దళారులకు అమ్ముకుని నష్టపోతారని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలని ప్రారంభించాలని అన్నారు. ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, వైస్ ఎంపీపీ అర్పీరావు, నాయకులు జక్కుల నాగరాజు ఉన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

ఆంజనేయుడి అనుగ్రహంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. అగ్రహారం హనుమాన్ ఆలయంలో నిర్వహించిన హారతికి మంగళవారం హాజరయ్యారు. జడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ జడ్పీచైర్‌పర్సన్ తుల ఉమ ఉన్నారు.